క్లుప్తంగా

అశోకుడి శిలాశాసనాల సందర్శన



శిలాశాసనాల వద్ద స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ నాగరాజు

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి- జీ.ఎర్రగుడి గ్రామాల మధ్యనున్న అశోకుడి శిలా శాసనాలను తహసీల్దార్ నాగరాజు శుక్రవారం సందర్శించారు. శిలా శాసనాల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్కడ స్థల పరిశీలన చేశారు. మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వో కిరణ్, సచివాలయ సర్వేయర్ ఉన్నారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తాం

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని కల్లుపెంట వీధి, 15వ వార్డులో శుక్రవారం పంచాయతీ ఈవో నరసింహులు పర్యటించారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. కాలువలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మద్దికెర : పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏఎన్ఎం గాయత్రి అన్నారు. శుక్రవారం ఎం.అగ్రహారం గ్రామంలో డ్రైడే, ఫీవర్ సర్వే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో ఎక్కువ రోజులు నీటిని ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

మద్దికెర : మండలంలోని రైతులు ఈనెల 15వ తేదీ లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏఓ రవి శుక్రవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. 15 వతేదీ వరకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు 70 శాతం ప్రక్రియ పూర్తయిందని త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి : 33 కేవీ లైన్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. తుగ్గలి, జొన్నగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వెల్దుర్తి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండల కేంద్రంలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపా రు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి వరకు ఈ - క్రాప్ బుకింగ్‌కు అవకాశం

హాలహర్వి: ఈనెల 15వ తేదీ వరకు రైతులు సాగుచేసిన పంటల నమోదుకు అవకాశం ఉందని ఏఓ శివశంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంతవరకు పంటలను సాగు చేసి ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రాల్లో పంటల వివరాలను తెలియజేయాలన్నారు. అలాగే ఈ-కేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

పత్తి మొక్కల తొలగింపు

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో గురువారం రాత్రి అక్బర్ అనే రైతు పొలంలోని 15 సెంట్లలో పత్తి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు పీకేశారు. పంట చేతికందే సమయంలో ఇలా మొక్కలను తొలగించడంపై రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

జీవో 85 రద్దు చేయాలి

హాలహర్వి: ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 85ను రద్దు చేయాలని వైద్యాధికారి వన్నూర్‌వలి, తిమ్మన్న శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



మాది సామాన్య రైతు కుటుంబం. ఉన్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాం. మా కుమారుడిని మెడిసిన్ చదివించాలనే ఆలోచన ఉంది. విజయవాడ చైతన్య కాలేజీలో లాంగ్ టర్మ్ కోచింగ్‌కు పంపాం. ప్రభుత్వ కాలేజీలో సీటు వస్తే చదివించుకోగలం. ఇప్పుడు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే మాలాంటి పేద కుటుంబాల పిల్లలకు వైద్య విద్య భారమవుతుంది. ఇలాంటి ఆలోచనను విరమించుకోవాలి.

\- వెంకటేష్‌నాయక్, లక్ష్మితండా, తుగ్గలి మండలం



కేఎంసీలో సీటు సాధించాలనే కోరిక ఉన్నా..



నీట్ యూజీలో నేను 619 మార్కుల స్కోర్ చేశా. గతేడాది మా కేటగిరీలో కేఎంసీలో 605 మార్కులు వచ్చిన వారికి సీటు వచ్చింది. కానీ ఈ యేడాది పోటీ పెరగడంతో కటాఫ్ మార్కులు కూడా భారీగా పెరిగాయి. ఇలాంటి సమయంలో కొత్త కాలేజీలకు ప్రభుత్వం అనుమతులు తీసుకొచ్చి ఉంటే సీట్లు పెరిగి మేం అనుకున్న చోట సీటు వచ్చేది. కానీ ఇప్పుడు మంచి స్కోర్ చేసినా అనుకున్న చోట సీటు వస్తుందో, లేదోనని సందేహం వెంటాడుతోంది.

\- దివ్యభారతి, మెడిసిన్ విద్యార్థి, పెనుమాడ గ్రామం, కృష్ణగిరి మండలం

మొక్కలేవి సారూ?

- మండలంలో కనిపించని మొక్కలు
- అట్టహాసంగా నాటి చేతులు దులుపుకున్న అధికారులు
- నిర్వహణను గాలికొదిలేసిన సిబ్బంది
- నీరుగారుతున్న పథకాల లక్ష్యాలు
- పచ్చదనం..పేపర్‌పైనే చూపుతున్న వైనం
- వృథా అవుతున్న ప్రజాధనం..

చిప్పగిరి: అవెన్యూ..బ్లాక్ ప్లాంటేషన్..సీడ్ డబ్లింగ్, కెనాల్ ప్లాంటేషన్..వనం.. మనం,పేరు ఏదైతేనేం వాటి లక్ష్యం మాత్రం మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించడంతో పాటు పచ్చదనం పెంపొందించడం. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పథకాల లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఏటా ఏదో ఒక కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారు. అధికారులు కూడా అట్టహాసంగా నిర్వహిస్తూ.. ఫొటోలకు ఫోజులిచ్చి మీడియాలో కవర్ కావాలి అంటూ ఆయా పత్రికల రిపోర్టర్లకు సూచిస్తున్నారు. నాటిన మొక్కను రక్షించేందుకు ప్రత్యేకంగా నిధులు కూడా విడుదలవుతున్నాయి. అయినా ఎక్కడ నాటారు? ఎప్పుడు నాటారా? అనేదే ప్రశ్న. సాధారణంగా మొక్క నాటిన తరువాత వాటి ఆనవాళ్లు కొన్ని రోజులు మిగిలే ఉంటాయి. కానీ మండలంలో మాత్రం ఎక్కడా మొక్కల ఆనవాళ్లు కనిపించడం లేదు. ఖాళీ ప్రదేశాలు, రోడ్లకిరువైపులా మొక్కలు నాటామనే లెక్కలు పేపర్లలో భద్రంగా ఉన్నా.. ఆయా ప్రాంతాల్లో మాత్రం వాటి జాడ కనిపించడం లేదు. మొక్కలు నాటి చేతులు దులుపుకొని నిర్వహణను ప్రకృతికి వదిలేశారు. దీంతో మొలక దశలోనే ఎండిపోయాయి. ఫలితంగా ఎక్కడా మొక్కలు పెరిగి పెద్దగా కాలేదు. ఇప్పటి వరకు మొత్తం వివిధ పథకాల్లో భాగంగా మండలంలో 3వేలకు పైగా మొక్కలు నాటినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఆ 3వేల మొక్కల్లో కనీసం 300 మొక్కలైనా కనిపించకపోవడం ఆశ్చర్యకరం.



ఏరూరు రోడ్డు కిరువైపులా కనిపించని మొక్కలు



చిప్పగిరి ఆలూరు ప్రధాన రహదారిలో కనుచూపు మేరలో కనిపించని మొక్క



బంటన హాలు రోడ్డు కిరువైపులా మొక్కల చుట్టూ రక్షణ కరువైన దృశ్యం



బంటనహాలు రోడ్డులో ఎదుగుదల లోపించిన మొక్క

17 నుంచి 'స్వచ్ఛతా హి సేవ '

తుగ్గలి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు అభివృద్ధి చేసుకోవడానికి మండల వ్యాప్తంగా ఈనెల 17వ తేదీ నుంచి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో అక్టోబర్ 1వ తేదీ వరకు కార్యక్రమాలు జరిపించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శ్రమదానం పేరిట అభివృద్ధి పనులు, ప్రతిజ్ఞ, ర్యాలీలు, మారథాన్ రన్, వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ గోపాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిసెంబర్ 8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

తుగ్గలి : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 8వ తేదీన ఉంటుందని పత్తికొండ ఎంఈవో-2 రామవెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 17వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. పాఠశాలల హెచ్ఎంలు వారి పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

ఆస్పరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం మండలంలోని పుటకలమర్రి దగ్గర ఉన్న మోడల్ స్కూల్ మైదానంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ షమీల పోటీలను ప్రారంభించారరు. మండల కోఆర్డినేటర్ విజయ్ అనంద్‌రావు ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, పరుగుపందెం, ఖో-ఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు ఏర్పాటు చేశారు. మండలంలో 12 స్కూళ్లకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు రంగస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, లతీఫ్, విజయ్‌కుమార్, రామాంజి, అంజి, రాజేశ్వరీ, మహేంద్ర, రాము అంపైర్లుగా వ్యవహరించారు. ప్రతిభ చూపిన వారు ఆలూరులో జరిగే తాలూకా స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని విజయ్ ఆనంద్‌రావు తెలిపారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: స్థానిక ఆలయంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ , గోవిందు ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మద్దికెర : స్థానిక మద్దమాంబ ఆలయంలో శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు చేపట్టి నైవేద్యం సమర్పించారు.

పత్తికొండ(తుగ్గలి) : మండల పరిధిలోని హోసూరు ఎస్సీ కాలనీలోని గ్రామ దేవత సుంకులమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ వాసులు శుక్రవారం ఆలయాన్ని, అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహం ఉండాలని కోరుకుంటూ చల్లపోసి పూజించారు.

దక్షిణామూర్తి ఆరాధనోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో వెలసిన దక్షిణామూర్తి 32వ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గంగ,ఆకుపూజ, పంచామృతాభిషేకం, గాయత్రీ మాత మహాయజ్ఞం, పూర్ణాహుతి, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వారి ఉత్సవమూర్తిని రథంపై అధిష్టింపజేసి భక్తుల మధ్య రథోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. మండలంలోని ఆస్పరి, బిల్లేకల్, వెంగళాయిదొడ్డి, డి.కోటకొండ, ములుగుందం, కైరుప్పల, చెన్నంపల్లి తదితర గ్రామాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, మండల ఉపాధ్యక్షురాలు చంద్రకళ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కృష్ణగిరి: ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈఓ సునంద పిలుపునిచ్చారు. మండలంలోని కంబాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థా స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభించారు. అండర్-17 బాలుర కబడ్డీ విభాగంలో కటారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, రన్నర్‌గా కంబాలపాడు జట్టు నిలిచిందని మండల క్రీడల కో-ఆర్డినేటర్ లక్ష్మయ్య తెలిపారు. బాలికల విభాగంలో అమకతాడు, కటారుకొండ జట్లు గెలుపొందాయి. ఖోఖోలో కంబాలపాడు, అమకతాడు జట్లు, అలాగే వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా పోటీల్లో గెలుపొందిన జట్లకు ఎంఈఓ, హెచ్ఎం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా షీల్డ్‌లు అందజేశారు.పీఎంసీ చైర్మన్ రవితేజ, మోహన్‌రెడ్డి, పీఈటీలు శేఖర్, రంగస్వామి, సుప్రియ, రామమద్దిలేటి, జయశ్రీ పాల్గొన్నారు.



బాలికల కబడ్డీ విజేత అమకతాడు జట్టుకు షీల్డ్ అందిస్తున్న దృశ్యం

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అల్లాబకాష్

ఆలూరు: ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ అల్లాబకాష్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేసిన వెంటనే ఆక్టివిటి మ్యాపింగ్ చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్,జీఎల్ఎస్ఆర్, ఓహెచ్ఆర్‌లలో ఎప్పటికప్పుడు శుభ్రం చేసిన తేదీలను రికార్డు చేయాలని చెప్పారు.

గుమ్మనూరు జయరాం జోక్యాన్ని సహించం

దేవనకొండ: ఆలూరు నియోజకవర్గంలో గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం జోక్యాన్ని సహించబోమని టీడీపీ మండల నాయకులు బడిగింజల రంగన్న, వెలమకూరు సర్పంచ్ భాస్కర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తికే ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వడం టీడీపీ విధానమన్నారు. టీడీపీలో ఉన్న నాయకులకు, కార్యకర్తలను విస్మరించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీలో చేరుస్తామనడం ఆయనకు తగదన్నారు. వరిముక్కల నాగేశ్వరరావు, విష్ణు, చాంద్‌బాషా, లక్ష్మన్న, చిన్నపటేల్, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నేడు హొళగుందకు ఎమ్మెల్యే రాక

హొళగుంద: మండల కేంద్రానికి ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి శనివారం రానున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా శుక్రవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్మన్, వైస్ ఎంపీపీలు, ఎంటీపీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు.

నివాళి

హొళగుంద: మండలంలోని నెరణికి తండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణానాయక్ (70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి గ్రామానికి చేరుకుని కృష్ణానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమ సంస్కారాలకు రూ.10 వేల నగదును అందచేశారు.

రీడింగ్ స్థలాన్ని విక్రయించడం సరికాదు

ఆలూరు: స్థానిక ఉపాధ్యాయనగర్ కాలనీలో ఉపాధ్యాయుల రీడింగ్ రూమ్‌కు కోసం సర్వే నంబర్ 7551 లో కేటాయించిన స్థలాన్ని కొందరు ఉపాధ్యాయులతో కలసి రిటైర్డు ఉపాధ్యాయుడు ఎస్.బాబాసాహెబ్ విక్రయించేందుకు ప్లాట్లుగా వేయడం దారుణమని ఎస్టీయూ యూనియన్ నాయకులు గిరిరయ్య,బాసుసాహెబ్,ఈరన్న ఆపేక్షించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమస్యపై తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఎస్‌జీఎఫ్ గేమ్స్, అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక నేతాజీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండల స్థాయి రన్నింగ్ రేస్, డిస్క్ త్రో బాల్ పోటీల్లో మొదటి, రెండవ స్థానంలో హర్షిత, రాజాసాబ్, సేవంతి, గుల్షన్ అహమ్మద్, కబడ్డీ పోటీల్లో హరికృష్ణ, భరత్‌కుమార్‌లు ఎంపికయ్యారని పాఠశాల కరెస్పాండెంట్, హెచ్ఎం మల్లికార్జున, గోపీనాథ్ తెలిపారు.

దేవనకొండ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేష్

దేవనకొండ: మండల కేంద్రానికి చెందిన వడ్డే ఉరు కుందు, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు వడ్డే వెంకటేష్ చరిత్ర విభాగంలో బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి శుక్రవారం డాక్టరేట్ పొందారు. ది అనాథరైజ్డ్ సెక్టార్ అండ్ వర్కింగ్ ఉమెన్ ఇన్ కాన్‌టెంపరరీ బెంగళూరు సిటీ అనే అంశంపై ప్రొఫెసర్ కేఎస్ విజయలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించారు. దీంతో యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడు పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

విరాళాలతో రోడ్డుకు మరమ్మతు



ధణాపురం రోడుపై గుంతలను పూడుస్తున్న ప్రొక్లెయిన్

హొళగుంద: ఎవరో వస్తారు...ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమతో పాటు మండల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్డును గ్రావెల్‌తో బాగు చేసుకున్నారు హెబ్బటం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు. గుంతలు పడి అధ్వానంగా తయారైన రోడ్డును బాగు చేసుకోవడానికి ఆటో డ్రైవర్లు విరాళాలు సేకరించి ఆ డబ్బుతో పాటు తాము కొంత వేసుకుని ప్రొక్లెయిన్‌తో రోడ్డును శుక్రవారం బాగు చేయించారు. ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలకు ప్రధానమైన ఆదోని-హొళగుంద ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పడింది.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను ఆపాలి

హొళగుంద: కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా వక్ఫ్‌బోర్డులో అనవసర జోక్యం ఆపాలని, చట్ట సవరణను మానుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ముస్లింలు రోడ్డెక్కారు. స్థానిక బస్టాండులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డును నిర్వీరయం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కబ్జాకు గురైన వేలకోట్ల రూపాయల వక్ఫ్ ఆస్తులను కాపాడాల్సి ఉండగా పట్టించుకోకుండా ఆ చట్టాన్ని సవరించాలనుకోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మత పెద్దలు హఫీజ్ కబీర్, శమీవుల్లా జమాయి, మౌలానా హబీబుల్లా పాల్గొన్నారు.

ఏచూరి మృతికి సంతాపం

ఆస్పరి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సీపీఎం నాయకులు హనుమంతు, రంగస్వామి, రామాంజనేయులు, రవి, శ్రీనివాసులు, మల్లికార్జున, తరుణ్, మహేంద్ర సంతాపం తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిలంచారు.

దేవనకొండ: సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను శుక్రవారం దేవనకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు యూసుఫ్‌బాషా పాండు, వెంకటేష్, కాంతయ్య, రవి, రాముడు, రంగన్న ఉన్నారు.

మద్దికెర : సీతారాం ఏచూరి మరణం తీరని లోటని ఆపద్బంధు సేవాసమితి అధ్యక్షుడు చౌక్కా సునీల్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ శుక్రవారం సంతాపం తెలిపారు. వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటన్నారు.

మారెమ్మ బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి పుట్లూరు మారెమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు
- 6 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు
- మూడు రోజుల పాటు అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: భక్తుల ఆరాధ్య దైవం, కొలిచే వారికి కొంగు బంగారమైన పుట్లూరు మారెమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంలోని పాలహంద్రీ నది ఒడ్డున వెలసిన అమ్మవారికి ఏటా బ్రహ్మోత్సవాలు జరుపుతున్నారు.

అమ్మవారి చరిత్ర..

202 ఏళ్ల క్రితం గ్రామానికి అనుకుని ఉన్న పాల హంద్రీలో అమ్మవారి ప్రతిమ వరదలో బయటపడటంతో గుర్తించిన పెద్దలు హంద్రీ ఒడ్డున ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతేడాది ఉత్సవాలు జరుపుకుంటున్నారు. కోరికలు తీరుతుండటంతో ప్రతి మంగళవారం అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు భారీగా వస్తారు.

ప్రత్యేకత..

ఇక్కడి అమ్మవారికి భక్తులు సమర్పించిన టెంకాయలు, మొక్కులు తీర్చుకున్న సమయంలో ప్రసాదాలు గ్రామ పొలిమేర దాటి వెళ్లకూడదు. ఇదే ఆచారం గత 202 ఏళ్లుగా కొనసాగుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పొరపాటున ఎవరైనా తీసుకెళ్తే గ్రామ పొలిమేర దాటేలోగా వారికి కీడు జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం.

ఆరు రోజుల పాటు కార్యక్రమాలు



ముఖ ద్వారం (ఇన్‌సెట్)మారెమ్మ మూలవిరాట్

➡ ఆదివారం గ్రామ శివారులోని ముఖద్వారం వద్ద పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి, ఇదే రోజు రాత్రి 9గంటలకు రాష్ట్రస్థాయి భక్తి భజన పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.18వేలు, రూ.15వేలు, రూ.12వేలు, రూ10వేలు, రూ.8వేలు అందించనున్నారు.

➡ 16న అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నూవేద్యంతో పూజలు చేస్తారు. ఉదయం 10గంటలకు పొట్టేళ్ల పోటీలు నిర్వహించి గెలుపొందిన యజమానులకు వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ10వేలను అందించనున్నారు. అలాగే విజయవాడ కిట్టు ఈవెంట్స్ సభ్యులతో డీజే కొలాటం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

➡ 17న అమ్మవారిని ప్రత్యేక నగలతో అలంకరించి ప్రతి ఇంటి నుంచి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు..

➡ 18న 6 పళ్లలోపు విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.25వేలు, రూ. 20వేలు, రూ.15వేలు, రూ. 12వేలు, రూ.10వేలను అందించనున్నారు.

➡ 19న న్యూ కేటగిరీ విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి, విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ. 30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేల నగదు బహుమతి ప్రదానం చేస్తారు.

➡ 20న సీనియర్స్ విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.70వేలు, రూ. 60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలను అందించనున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు సెల్ 8639363721, 7589390793 నంబర్లలో సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.